జయాపజయాలు

'శండిల'

* గతసంచిక తరువాయి

9

వరహాలు ఒకనాడు ఏకాంతంలో అబ్బాయి భార్యతో జరిగినదంతా చెప్పింది. భర్తను అతని ప్రయత్నంనుంచి వారించమని ప్రతిమాలింది. కాని ఆమె దాన్ని పెడచెవిని బెట్టింది. తన భర్తకోసం ఏమైనాసరే చెయ్యడానికి వరహాలు సిద్ధంగా వుండాలన్నట్లు వ్యక్తంచేసింది ఆ యిల్లాలు. ఒక పేదరాలు, దాసి, తలదాచుకోడానికి నీడ లేనిది, అనాథ, అరక్షణీయ—దీనికింత అభిమానమా అని చీదరించుకున్నట్లుంది ఈ ధోరణి. స్త్రీ సహజమైన సౌకుమార్యం గూడా లోపించింది ఆ పడతిలో. ఇట్టి అతివ గూడా వుంటుందా లోకంలో అనుకుని వరహాలు విస్తుపోయింది. "సరే—నీ కర్మ" అని అనుకొని ఇంక ఈమెకు చెప్పి లాభంలేదని నిశ్చయించుకొంది. అబ్బాయినుండి అనేకసార్లు తప్పుకోవడానికి శాయశక్తులా ప్రయత్నించింది.

అబ్బాయి సామాన్యుడు కాదు. ఎప్పటికప్పుడు ఎత్తుపైయెత్తులు వేస్తూనేవున్నాడు. ఆమెను వెనుదిరిమి కవ్వించి కసి ఎక్కించాడు. ఇంతటి ఘర్షణ సంగతి ఒకవంతు: వరహాలు—స్త్రీ—అందునా అసాధారణమైన ఆడుది—అన్నది మరొకవంతు. ఆమె అబలత్వానికి లొంగిపోయింది; కాదు కాదు ఆమె వలలో పడిపోయాడు అబ్బాయి. సాలీడు పన్నిన పద్మవ్యూహంలో మరొక మక్షికం చిక్కుకొంది. తొలినాళ్ళలో ఎంతో ఆనందం అనుభవించిన అబ్బాయి క్రమక్రమంగా పాలిపోయి లోపల్లోపల ఏదో ఆవేదనతో తుదకు వరహాలు అంటే భయపడేస్థితికి వచ్చేశాడు నెల్లాళ్ళలో. అతని పరిస్థితే మారిపోయింది. ఇంట్లోంచి ఇవతలకు రాడు. కారణం ఎవరికీ చెప్పడు. ఒకనాడు రంభలాగ అవుపించిన వరహాలు ఇప్పుడతని కంటికి కామరూపంలో వున్న మహారాక్షసి.

ఒకనాడు ప్రొద్దెక్కి వచ్చాడు చౌదరీ ఇంటికి. అబ్బాయి స్థితి నానాటికి శ్రుతిమించి పోతోందని తెలుసుకున్నాడు. ఆరాత్రి రహస్యంగా వరహాలును పిలిపించాడు—కళ్ళెర్రజేసి ఉరుముతున్నట్లు ప్రారంభించాడు—

"త్రాచుపామువని తెలియక తలమీద పెట్టుకున్నాను కూటికి పేదలు గాని గుణానికి పేదలా అని భ్రమించాను గాని కులటవనుకోలేదు."

వరహాలు ఏమీ సమాధానమియ్యలేదు. ఇవ్వదల్చుకోలేదు. నేలవంక చూస్తూ కుడికాలి బొటనవ్రేలితో వృత్తం నుడుతోంది.

"ఇంతకంటె చిప్ప పుచ్చుకుని అడుక్కోగూడదూ? ఆ అయ్యారును నాశనంచేసినదానవు నువ్వే అంటే నిజం కాదనుకొని నిన్నాడిపోసినవాళ్ళందరినీ తూలనాడాను... సాగుతూంటే పెళ్లెందుకూ? ఛీ! వెధవ వృత్తి!" పురుగును వొంటిమీదనుంచి ఏరి పారేసినట్లు ఆయన దూషణలోని చివరి చురుకు చబుకు దెబ్బలాగ ఆ పిల్లకు తగిలింది. దానితో ఆమె అభిమానం పడగెత్తింది.

"చౌదరిగారూ! నేను చిన్నదాన్ని. మీలాగే మాట్లాడగల్ను. కాని నాచేత వాగించకండి" ప్రాధేయపూర్వకంగా అన్నది.

"ఛీ—నోర్ముయ్. చిన్నదట చిన్నది! పెద్దవాళ్ళ కొంపలు గుల్లచెయ్యడానికి బయలుదేరిన పింజారి."

"చాల్లెండి. పెద్దవాళ్ళైతే అయ్యారు గాని ఇంక తగ్గించండి. ప్రమాదమొస్తుందని ఒకసారి గాదు,

లక్షసార్లు అబ్బాయితో నేగాదు—కోడలుతో గూడా చెప్పాను. నేను ఏం చేసినా లోకువే—బ్రతికి చెడ్డ వాళ్ళపాటే అంతలెండి. ఒదిగివుంటే ఒక తప్పు; ఒదక్కపోతే మరో నేరం. మీ అబ్బాయి ఆడిన మాటలు, చేసిన చేతలు నా నోటంట చెప్పరానివి. మీరేమనుకున్నా సరే ఒక్కటి మాత్రం ఖచ్చితం చెయ్యదలుచుకున్నాను. ఇందులో నా తప్పేమీ లేదు. నేనే గాదు, ఏ ఆడదైనా ఇలాగే చేసి వుండేది”

“సరేలే—ఇంక నీ నీతు లనవసరం. దయ చెయ్యండి బయటకు. వారం రోజుల్లో మరో మకాం చూసుకోండి. ఇంకెంతమాత్రం మీరిక్కడుండడానికి వీల్లేదు.” ముడిగా ముగించాడు చౌదరి.

మరునాడు ప్రొద్దుటనే పట్టణంనుంచి డాక్టరును ప్రత్యేకంగా పిలిపించారు అబ్బాయిని పరీక్ష చెయ్యడానికి. డాక్టరు శ్రద్ధగా కేసు తనిఖీచేశాడు. కిటికీ ప్రక్కగా గోడవారన నిలబడి వరహాలు ఈ తతంగమంతా చూస్తూ డాక్టరు చెప్పేదంతా వింటోంది. చౌదరీ, డాక్టరూ అక్కడనుంచి వీధిలోకి వచ్చారు. వీధిగదిలో ప్రత్యేకంగా డాక్టరుకు టిఫెనూ, కాఫీ యేర్పాటుచేశారు. కాఫీ త్రాగుతూ సావకాశంగా చెబుతున్నాడు డాక్టరు. “చౌదరిగారూ! వ్యాధి చాలా గడ్డుది. మన పెద్దలు ఊరికే అన్లేదు “అర్ధగంట భోగం; ఆర్నెల్లు రోగం” అని. సరిగా కుదుర్చుకోకపోతే ఏడు తరాలు ఏడిపిస్తుంది ఈ జబ్బు. అబ్బాయికి కీళ్లు సరిచెయ్యడానికి లేదంటే నాలుగు నెలలు పడుతుంది. పడుచుదనపు బింకం ప్రకటిస్తే ప్రాప్తించే విష ఫలితాలివే. సుమారు నాలుగు వందలు రూపాయలు ఇంజక్షన్లకే అవుతాయి. తర్వాత ఫీజు మాట మీరున్నారు; నేనున్నాను” అంటూ లేచాడు. చౌదరికి గుండె బరువెక్కి కళ్ళనీళ్ళ పర్యంతమైంది.

తర్వాత కోడలిని కూడా చూడమన్నాడు. ఆమెనుగూడా పరీక్షించి డాక్టరు అయిదు నిమిషాల్లో తేల్చేశాడు. “చూశారా! తనతోబాటు ఆ సౌభాగ్యం భార్యకు గూడా పంచిబెట్టాడు. ఇంకా వ్యాధి ఈమెలో తీవ్రరూపం దాల్చలేదు. క్రమేపీ వేళ్లు పాదుకొంటుంది. వీళ్లు చేసిన నేరాలకు ఆగామిసంతతి కఠిన శిక్షలు అనుభవించాలి. చచ్చి పుట్టే బిడ్డలు, అంగవైకల్యంగల శిశువులు, అనాసలు, పీలవాళ్లు—ఒకటేమిటి చెప్పరాని అనేక అవకుణాల కుప్పలుగా పుడతారు పిల్లలు. ఈమెగూడా జాగ్రత్తగా మందు పుచ్చుకోవాలి.” డాక్టరు లేచి బయలుదేరాడు. వరహాలు వింటూనే వుంది ఈ మాటలన్నీ చాటుగా. కొంచెం సానుభూతికూడా కలిగింది. సర్పదష్టులై నేల గూలినవాళ్ళకువలె వ్యాధిపీడితులైన ఆ దంపతుల్ని తలుచుకుంటే. కాని తానేమి చేయగలదు? సకాలంలో ఇరువురను హెచ్చరించింది. ఆమె హెచ్చరికను వాళ్లు మరొకలాగున అర్థంచేసుకున్నారు. శిక్ష అనుభవించాల్సిందే—

ఆవాళ సాయంత్రం ఎవరూ లేని సమయం కనిపెట్టి గుచ్చిగుచ్చి అడిగాడు కొడుకుని తండ్రి. తాను అనుకున్నదే నిజమయింది. “దీనికంతకి అదే నా కారణం?” గద్దించాడు.

“కాదు నాన్నా—నేనే కారణం. కళ్ళూవొళ్లూ తెలియలేదు. ఆమె జాగ్రత్త అని ముందే చెప్పింది. నే వినలేదు. ఇప్పుడనుకొని ప్రయోజనం లేదు.” బాధతో అన్నాడు కొడుకు.

“చెప్పిందిట! ఏం చెప్పింది దాని మొహం. కూర్చోడానికి తావిస్తే పడుకు నేరకం. అసలు వీళ్లను చేరనియ్యడం నాదీ తప్పు. ఎప్పుడూ పరాయి ఆడదంటే ప్రక్కకు తప్పుకొనే నీకెలాగ పుట్టిందిరా ఈ బుద్ధి?” చీదరించుకున్నాడు చౌదరి.

“ఇది నా కర్మ నాన్నా. పాపం! దీనిలో వరహాలు నేరమేమీ లేదు. నువ్వేమనుకున్నా సరే” అంటూంటే పొరుగింటికెళ్ళి పిడకతో నిప్పుతెస్తున్న వరహాలు ఆ తండ్రీకొడుకుల సంభాషణలోని ఆఖరు మాటలు విని లీలగా లోలోపలనే మందహాసం ముడుచుకుంది.

10

వరహాలుకు చౌదరి ఉద్వాసన చెప్పగానే ఊళ్లో చక్కని ఇంటి నొకదాన్ని అద్దెకు తీసుకుంది. కొందరు ఆమెను ఎగాదిగా చూసి తమ కొంప లివ్వడానికి అభ్యంతరం తెలిపారు. ధనాశ కొందరిని అన్ని అవరోధాలకు దూరంచేసింది. ఆఖరికి అయినింటివాళ్ల యిల్లే దొరికింది. సుమారు ఒక నెల గడచే వరకు ఆమె తన భవితవ్యం నిర్ణయించుకోలేదు. దానికి కారణం ఆమె తండ్రి మంచంబట్టడమే. రోజు

రోజుకీ మనసుతో బాటు శరీరంలో కూడా రోగం ఎక్కువయ్యింది. పైకి చెప్పలేకపోతూ లోపల్లోపలనే తన కూతురు నడవడికి కుళ్ళిపోతున్నాడు. మానాభిమానాలు ఆతన్ని మ్రగ్గబెట్టాయి. పౌరుషానికే బ్రతకమన్నది అంతరాత్మ. క్రమంగా తీసుకు తీసుకు చావడమే శరణ్యం అన్నట్టు శాసించింది లోకం. అన్యాయానికి, దౌర్జన్యానికి, అవినీతికి కాలం తాళం వేస్తుంది. తన కుమార్తె పాడి దప్పింది అనుకుంటూ రాత్రింబవళ్లు నిద్రాహారాలు మానుకొని కట్టె అయిపోయాడు తండ్రి. ఆ ధోరణి అసలే కుదరదు అనుకున్న వరహాలు ఏరోజు కారోజు ఏపుగా పెరుగుతోంది. డాక్టర్ల చేత మందూ మాకూ యిప్పించింది తండ్రికి. కాని ఆ ప్రాణి నిలవలేదు. నానాటికి కృశించి, నీరసించి, ఆ కుటుంబంలోని మిగతా యిద్దరినీ పీల్చి పిప్పిచేసి తుట్టతుద కొకనాటి రాత్రి కాలం చేశాడు.

తండ్రి పోయి దుఃఖించే వరహాలుకు గాని, ఆమె తల్లికి గాని ఊళ్ళోవాళ్లు పల్లెత్తు సాయం చెయ్యలేదు. తను నిల్వ వుంచుకున్న అయిదు వందల్లోనూ రెండు వందల రూపాయలు ఖర్చుపెట్టి తంతు జయప్రదంగానే ముగించింది. ఇంట్లో ఇప్పుడు తానే యజమాని గనుక క్రమేపీ ఆమెలో పురుషులను మించిన గుండె నిబ్బరం, గడుసుదనం నాటుకున్నాయి. ఆడదానికి స్వతహాగావుండే కోమలత్వంకూడా ఆమెనుండి అంతర్థానమై మొద్దుబారిపోయింది. కేవలం స్వశక్తిపైనే ఆధారపడి అభిమానంతో తన పెత్తనం తానే చలాయించుకుంటోంది. తరచు తన వ్యవహారాలకు అభ్యంతర పెట్టే తల్లిని కూడా గదమాయించి త్రోసిరాజని ఆమెను మూలబెట్టి అధికారం చలాయిస్తోంది. లోకం మీద ధ్వజమెత్తడానికి మళ్ళీ లేచి నిలబడింది.

కాలం వడిగా మళ్లిపోతోంది. చూస్తూంటే నెలలు గడచిపోతున్నాయి. పుండ్లు మానినట్లు వరహాలు బాధలు కూడా సమసిపోతున్నాయి రోజుల మూతల్లో. మళ్ళీ ఆమె అందాలు కసిగా త్రాగడానికి ఊళ్ళో వేట మొదలైంది. పెద్దపెద్ద యిళ్లలోంచి కొందరు సిగ్గు విడిచి తనకోసం కబురంపడం, వందలకు వందలు ఆశ చూపడం ప్రారంభం. వరహాలుకు ఎర చూపి కొందరు, ఆమెను ఓదారుస్తున్నట్టు నటించి కొందరు తమ వాంఛలు తీర్చుకోడానికి ఎగబడ్డారు. వరహాలు దీన్ని జాగ్రత్తగా గమనించింది. బాగా ఆలోచించి, కార్యక్రమం స్థిరపరచుకుని ఉచ్చులు పన్నింది. ఆమె వలలో ఒక్కరొక్కరే యువకులు పడడం ప్రారంభించారు.

ఒకడు షావుకారు. మూడు వందల రూపాయలతో వాలాడు ఆమె ముందు. ఆమె 'ఊఁ' అంటే గులాముగా వుంటానని ప్రాధేయపడ్డాడు. అయ్యారు అమాయకత గాని, అబ్బాయి దౌర్జన్యం గాని వీడిలో లేదు. వీడు పట్టె నీచుడు. ఏ సుఖమైనా సరే డబ్బుతో కొనుక్కుంటానంటాడు. డబ్బుకోసం ఎంతటి నీచాతినీచానికైనా ఒడిగడతాడు. వీడి పతనం తేలికగా జరిగిపోయింది. వరహాలుతోడి పదిహేను రోజుల సాంగత్యం వీణ్ణి పడగొట్టడానికి సరిపోయింది. చిబుకం పట్టుకొని బ్రతిమాలుకొంది, "పిచ్చివాడవై పోతున్నావ్. పుట్టగతులుండవు మళ్లీ" అని హెచ్చరించింది. కామం ఎటువంటివాణ్ణైనా గుడ్డివాణ్ణిగా చేస్తుంది. కానుకోలేక చేసేతులా అర్థాన్నీ శరీరాన్నీ తగలేసుకున్నాడు. లోకంతీరే అంతేమో! కష్టించే వాళ్లను, నీతినియమాలకోసం నిజాయితీగా బ్రతికే వాళ్ళను ఎముకలకంటా నెత్తురును పీల్చేసి వాళ్ళ యిబ్బందులపై డబ్బుచేసుకొంటుంది. తప్పు అని తెలిసి, తమకు నాశనకారి అని గ్రహించి తమకుగా తాము అవినీతి అనే అగ్నిగుండంలో కళ్లు తెరచుకుని దిగి విష ఫలితాలను అనుభవిస్తూ, తమ బంధుమిత్రులచే అనుభవింప చెయ్యడానికి గూడా వెనుదియ్యరు. ఇదే వారికి ఆనందం—

ఆ వూళ్లో అందరి అవస్థకన్నా గవళ్ళ కుర్రాడి పరిస్థితి వరహాలుకు జాలిగొలిపింది. ఆనాడు మిరపతోట ఊడుపునాడే వాడికి వరహాలుపై కన్ను పడింది. చాలారోజులు ఆమెను తలచుకుని పిచ్చిగా ప్రవర్తించాడు. కొన్నాళ్లు వాడి దారిలో చౌదరి ఒక కంటకం. 'వరహాలుమీద దృష్టి మళ్లించుకో' అని మచ్చరంతో హెచ్చరిస్తున్నట్టు ఒకటి రెండుసార్లు అబ్బాయి వాడికి దేహశుద్ధి చేయించాడు. కాని దెబ్బ తిన్నకొద్దీ వాడికి మైకం ఎక్కువయ్యింది.

కృత్రిమ మెఱుగని పచ్చి కామేచ్ఛ వాడిది. జబ్బ సత్తువమీదనే ఆధారపడి బ్రతికే మనిషి. కండలు దేరిన చేవ శరీరం. రెండు జబ్బలకు తాయెత్తులు. మిసమిసలాడే నలుపుచాయ. గునపం దిగేసినా బెసగని

దేహసౌష్ఠవం. ఇలాంటివాడికి వరహాలుమీద కన్ను పడిందీ అంటే ఏమనుకోవాలీ? వాడికి చేటుకాలం దాపురించిందనేగా! అంతే—ప్రత్యక్షంగా కట్టెదుట అవినీతి చర్యల విషఫలితాలు చూస్తూనే వాడు దిగిపోయాడంటే—ఇంకేం చెబుతాం? అర్మం కర్మం తెలియని మనిషి. చాదరికుండే లౌక్యం లేదు; పావు కొరుకువలె ధనం లేదు.

అందుకే ఒకనాటి సాయంత్రం ఏకాంతంగా తన్ను కలుసుకొన్నపుడు స్వయంగా వరహాలు కేవాడిమీద మోజు పుట్టినా "ఈ దారికి రాక"ని హెచ్చరించింది. అసలు ఆ సన్నివేశమే విచిత్రమైనది. సాయంత్రం మళ్ళిపోయిన సమయం. సూర్యాస్తమయమైన తర్వాతఉన్న కొద్దికాంతినిగూడా చీకటి తెరలో దాచ ప్రయత్నిస్తోంది. వరహాలు తోటనుంచి తిరిగి వస్తోంది. పుంతలో మెల్లిగా అడుగులేసుకుంటూ నడుస్తున్న ఆమెను ఆ ఏకాంత ప్రశాంత వాతావరణంలో ఎవరో అమాంతంగా వొడిసి పట్టినట్లు గుర్తించింది. గుండె ఝల్లుమంది. కాని ఆ కండలు, జబ్బలు ఆమెకు సుపరిచితాలే. ఎన్నోసార్లు ఆ మెలిదిరిగిన కండల తోడిబాహువులు తమలో తనను ఇముడ్చుకోడానికి మూగగా వ్యథ చెందుతుండడం వరహాలు చూసింది. వెనక్కు తిరిగి తాను పూర్తిగా గవళ్లకుర్రాడి వల్లరిలో పొదిగికొనివున్నట్లు తెలుసుకుంది. "ఛీ—వొదులు. ఏమిటీ మోటసరసం?" అంది ఆ సంజ చీకటిలో పెదిమలపై చిరునవ్వును చిందిస్తూ. వరహాలు అప్పటికే జాణలజాణ సెరజాణ అయింది. వాడి కౌగిటిలో నేవుండి చిటికెనవ్రేలితో బుగ్గతట్టి సున్నితంగా వాడికండలు నిమిరి నెమ్మదిగా లాక్కెళ్లి మళ్ళ గట్టుమీది దిరిశెన చెట్టుక్రింద కూర్చోబెట్టింది. ఆమెకు వాడిమీద వాంఛ అయితే వుందిగాని మనసు వాణ్ణి పాడుచెయ్యడానికి వొప్పుకోలేదు.

"ఒరే—నీ ఉద్దేశ్యం ఎన్నాళ్ళనుంచో ఎరుగుదును. ఎప్పటికప్పుడే చెబుదామనుకుంటున్నా. ఈవూళ్లో అందరికన్నా నువ్వంటే మక్కువ ఎక్కువ నాకు. ఒకటి చెబుతాను వినవూ?" జాలి గొలిపేస్వరంలో అంది వరహాలు.

వాడు ఈసరికే నీరైపోయాడు. ఆమె ప్రయోగించిన సమ్మోహనాస్త్రానికి మూర్ఛపడి నోటమాట రావడంలేదు. వాడి సత్తువంతా ఎక్కడ నక్కిందో? కడివెడు గుమ్మడికాయా కత్తిపీటకు లోకువగదా" మొదట్లో ఆమె తన్ను తన్నుతుందో, నుదురు పగలకొడుతుందో, రక్కుతుందో, కరుస్తుందో—అదీ చేతగాకపోతే నలుగురినీ పిలిచి బిగ్గరగా గొడవచేస్తుందో అనుకున్నాడు. అయితే తాజేసే అఘాయిత్యానికి ఫలితంగా ఎంతటిదారుణం అనుభవించడానికైనా సిద్ధమై తెగించాడు. వాడు వట్టి మృగం. అంతే. తాను అనుకోకుండా ఆమెనుండి అంతటి తీయని పలుకులు వెలువడ్డంతో మూగవోయి గంగిరెద్దులాగ ఆమె ఎలాగ లాగితే అలాగే వెళ్ళి చెట్టుకింద చదికిలబడ్డాడు.

"ఏరా! మాట్లాడవ్?" పీచురేగే వాడిజుట్టు పట్టుకుని గుంజుతూ మళ్ళీ అడిగింది. ఆమె ప్రతిస్పర్శ వాణ్ణి ఎక్కడికో అర్థంగాని అవస్థలోకి నెట్టేస్తోంది.

"నీయిష్టం" అనిమాత్రం అనగలిగాడు.

"లే—బుద్ధి తెచ్చుకో — ఇలాంటి పని ఇంకెప్పుడూ చెయ్యకు. ఎవరిదగ్గరైనా నాటకాలాడు కాని నాదగ్గిరకాదు. తెలిసిందా? నామాటవిని మంచి మార్గానపోతావా సరే — లేదూ — ఏమైపోతావో తెలుసా?" అని నిరుత్తరుడై నిశ్చేష్టుడై వున్నవాణ్ణి లేవదీసి రెక్కపట్టుకుని గుడ్డివాడివలె తన్ను అనుసరిస్తుండగా పూరి మొగిసందులో వదలి వరహాలు ఇంటికి జారుకుంది.

ఆమె తనను విడిచిన కొద్ది నిముషాలకుగాని గవళ్ళవాడికి తెలివిరాలేదు. జరిగిందంతా కలవలె తోచింది వాడికి. అంతదాకా స్వర్గంలో ఏ గంధర్వాంగనతోనో హాయిగా గడిపినట్లు అనిర్వచనీయమైన ఆనందం అనుభవించాడు. వరహాలు అన్న ప్రతి అక్షరమూ వాడి చెవుల్లో మారుమ్రోగింది. కాని అది వ్యతిరేక ఫలితాలనే యిచ్చింది. మూర్ఖులకు చేసిన హితోపదేశమే అయి వూరుకుంది. కాగా ఆ హితవు వాణ్ణి ఆమెకు దగ్గరగా లాగేసింది.

తరువాత చాలాసార్లు వరహాలూ, వాడూ కలుసుకున్నారు. పెక్కుసార్లు వాడికి హితవు బోధించింది. కొట్టింది. అవమానపరిచింది. కాని వాడు మనిషికాక జంతువైపోయాడు. అన్నీ తుడిచేసుకుని ఆమెను వెనుదవిలాడు. వరహాలు ఎంతో బాధపడింది. జాలిపొందింది. దుఃఖించింది. చీదరించుకొంది. వికారంగా, బుద్ధిహీనుడుగా చిత్రించుకొంది. సానుభూతి

చూపింది వాడి అవస్థకి. బ్రతిమాలుకొంది వైదొలగమని. తుదకు లొంగిపోయింది. వాణ్ణి నాశనం చేసేసింది. ఎవరిని తలుచుకునీ కంట తడిబెట్టలేదుగాని వీడినిచూసి విలపించింది. అయ్యారు తన వూళ్లో సుఖంగా బ్రతుకుతూ వుండగలడు. చౌదరీ వందలకు వందలు గుప్పేసి కొడుకునీ, కోడలును బాగుచేయించుకుంటాడు. షావుకారు కేమీ కొదవలేదు. మరి వీడికో. తన కోసమని కానిపనులెన్నోచేసి నూరు రూపాయలు తెచ్చాడు. ఉన్మత్తుడయ్యాడు. వాడి బలానికి తనూ మోజుపడింది. మళ్లీ వాడి సొమ్ము వాడికిచ్చెద్దామని తెగవెతికితే కనబడలేదు. తర్వాత తెలిసింది ధర్మాసుపత్రికి వాణ్ణి యీడ్చుకువెళ్ళే దుర్భరస్థితికి వాడు పాల్పడ్డాడని. వాడికోసం ఎంతగానో ఆవేదన పొందింది.

ఇంక ఆ వూళ్ళో వుండకూడదని నిశ్చయించుకొంది. తల్లితో మకాం మార్చేసింది పట్నానికి. ఊరు విడిచి బండి నడుస్తూంటే బరువుగా ఆమె ఊహాపథంలో ఎన్నో కలలు చెలరేగి చెరిగిపోతున్నాయి. ఈవూరు తన జీవితంలో ఇంతటి తుఫాను రేపుతుందని అనుకోలేదు. అన్నిటికన్నా గవళ్ళకుర్రాడి దీనావస్థే పొలిమేరదాటినా ఆమె మనస్సును దాటలేదు.

11

వరహాలు ప్రవేశించింది మంచి అందమైన పసగల పసందైన పట్టణం. జీవితంలో ప్రప్రథమంగా ఎన్నోరకాల మనుషుల్ని వాళ్ళ విచిత్ర వర్ణాల్ని చూసి విభ్రాంతి నొందింది. ఆమె అక్కడి వ్యక్తులను లోపలకుకూడా చూసే అవకాశం లభించి ఆనందిస్తోంది. ఎన్ని వింతలు, ఎన్ని విచిత్రాలు! ఆమెకు ఇక్కడ మాత్రం ఒక అపూర్వ సౌఖ్యం వంటిది లభించింది. గ్రామంలో జనాభా కొద్దివేలకే పరిమితం కావడంవల్లను, పల్లెటూరు పడికట్టువల్లను తనకు తెలియకుండా తన చుట్టూ ముళ్లకంచెలాగ పరిమితులుండేవి. ఇక్కడో—అవేమీ లేవు. తాను ఎలాగున్నా సరే తన ప్రసక్తి అక్కరలేని ప్రజ. తాను ఎలా సింగారించుకున్నా సరే ఆ పక్కా యీ పక్కా బుగ్గలు నొక్కుకునేవాళ్ళు లేరు. తన ఊసు ఇక్కడెవరికీ అక్కరలేదు.

కూడా తెచ్చుకున్న అరసంచి రూపాయలూ పొదుపుచేసుకుని ఒక చిన్నయిల్లు అద్దెకు పుచ్చుకుని క్లుప్తంగా సంసారం పెట్టుకున్నారు తల్లీ కూతుళ్లు. ఇంటి పెత్తనం అంతా ఇప్పుడు వరహాలుదే. ఇతః పూర్వం తల్లి కాస్తా కూస్తా ఏమేనా విసుక్కోవడం, కసుక్కోవడం వుండేదికాని ఇప్పుడేమీ లేదు. స్వతంత్రంగా గృహయజమానికుండే ఠీవీ, ఆర్భాటమూ, బాధ్యతలు వరహాలులో తిష్ఠ వేసుకున్నాయి. సుమారు నెలరోజుల్లో పట్నవాసం జీవితపు ఆనూపాను కొంతవరకు ఆమూకీ తీయగలిగింది.

తీర్చిదిద్దిన రాజబాటలు; ఏమి కావాలంటే అవి దొరికే దుకాణాలు; ఎల్లప్పుడు వచ్చిపోయీజనంతో కిటకిటలాడే హోటళ్లు; సంగీతాలు; రేడియోలు; నాటకాలు; సినీమాలు; నదీతీర విహారాలు; పార్కులు; ఫ్యాక్టరీలు; రైళ్లు, కార్లు, రిక్షాలు వరహాలుకు క్రొత్త ప్రపంచాన్ని రోజుకో రంగులో మెరిపించాయి. వీటితోబాటు విచిత్రప్రవృత్తి గల వ్యక్తులు, తమ యీప్సితాలు నెరవేర్చుకోడానికి వాళ్లు వేసే ఎత్తు పైఎత్తులు, వ్యాపారంవల్ల ప్రయాణీకులవల్ల రోజుకు వందలు గడించే లక్ష్మీపుత్రులు, వీళ్లచే పీల్చి పిప్పిచేయబడే కష్టజీవులు, నిలువ నీడలేక బాట కిరుప్రక్కల మార్కెట్టు పంచల స్థిరనివాసం ఏర్పరచుకొని బూజుపట్టిన తలలతో చీకూ చింతా లేనట్లు జీవితం వెళ్లబుచ్చే అనాథులు—రాత్రిళ్లు రైల్వేస్టేషను సమీపంలో వుండే వెయిటింగు రూముల వార, సమీపంలోని చెట్లనీడల సినిమాహాళ్ల ప్రాంగణంలోని కిళ్లీకొట్ల సందుగొందుల సత్రాలు హోటళ్ల గదులదగ్గర, — ఏదో ఆకలీ, ఆశా తీరని నిరీక్షణతో తచ్చాడేభామినుల — ఎందరెందరనో చూసి ఆమె తన ఊహావలయం ఎంతో విస్తృతం చేసుకుంది. ఇంతటి దట్టమైన జనసమూహంలో తన జీవనోపాధి అంత కష్టమనిపించలేదు. ఏపనిచేసినాసరే తెల్లవారిపోతుందనే హామీ ఏర్పడింది.

నాలుగునెల్లపాటు గౌరవంగా ఆ నగరంలో బ్రతకడానికి బాటలు వెదికారు ఆ తల్లీ కూతురు. మొదట్లో ఏవో తినుబండారాలు భారీ యెత్తున చేసి కారుస్టాండుదగ్గరా సినిమాహాలు ముందరా చిల్లరగా అమ్ముకునే కుర్రాళ్లకు విక్రయించేవారు. ఇది కొంచెం ఆశ నేచూపినా ఆట్టేకాలం నిలకడగా వారికి

ఉపాధి కల్పించలేదు. చేదోడుగా వుంటుందని చిన్న హొటలు పెట్టారు. కాని ప్రతి అడుగునా వరహాలుకు ఇలాంటి పనులవల్ల జీవయాత్ర తుదిఘడియదాకా జరగదని ఎవరో తనలోనుండి చెబుతున్నట్లు తోచేది. ఎంత నిరోధిద్దామని ప్రయత్నించినా ఆమెలోని అందం వీధిలోకి రావడం మానలేదు. పట్నంలో ఎన్ని ఎత్తులుంటాయో! తన వద్దకు బేరాలకువచ్చే కుర్రాళ్ళలోనే, అమాయకపు ఇల్లాళ్ళవలె అవుపించే ఆడవాళ్లలోనే ఆవులిస్తే ప్రేవులు లెక్కపెట్టేవాళ్ళుంటారని గుర్తించలేకపోయింది. పట్నవాసపు పసివాళ్లు పల్లెవాళ్ళకుమల్లే గాదుగా! ఏళ్ళు మళ్లి యాభయ్యో పడిలోవున్న పెద్దమనిషంతవాడు డిప్పకాయముందు తీసికట్టు. సినిమాలు, నాటకాలు, వగలాళ్ల వన్నెపోకడలు వాళ్లలో లేని, ఉండగూడని విషవాంఛల్ని పాదుకొల్పి నాశనం చేస్తున్నాయి. వరహాలు అవివాహిత అనీ, ఆమె యింక పెళ్ళిచేసుకోదనీ, చెయ్యి జారపెట్టుకున్న పడుచు అనీ, జాణల్లో కెల్లా జాణయనీ తెలుసుకోడానికీ — తనులో తాను గుణించి గణించుకోడానికీ అట్టే కాలం బట్టలేదు. వరహాలుకూడా దీన్ని గమనించింది. ఎప్పుడైతే ఈమె ఇలాంటిదని గుర్తించారో వాళ్ళకు వరహాలంటే మొదట్లో వుండే గౌరవం తొలగిపోయింది. వెకిలి పోకడలు, వేళాకోళాలు, వింత వింత ప్రచారాలు ప్రారంభమయ్యాయి. నాలుగు మూలలా పాక్కింది వరహాలు ఉదంతం. ప్రతినోటా ఆమెను గూర్చిన పలుకే. ప్రతికంటా ఆమె మాపే. ఆయా రంగాల్లో వరహాలును గూర్చిన చర్చలు చెలరేగాయి. ఆమెకై అనేకవిధాల వేట మొదలు. రాత్రింబవళ్లు తనవద్దకు ఎందు కెందుకో వంకలుబెట్టుకుని వస్తూ, ఏపనీ లేకపోయినాసరే తన శ్రేయోభిలాషులవలెనో, మిత్రులవలెనో నటిస్తూ గంటలతరబడి తిన్నారికే చూస్తూనో లేక అనవసరపు కబుర్లుపెట్టి ఎలాగో తనతో కాలక్షేపం చేస్తూనో వుండే ఆడవాళ్ళను మగవాళ్లను చూసి అసహ్యించుకొనేది. అయితే ఆ కొద్దికాలంలోనే తాను ఆ పరిసరాలకు ఒక ఆకర్షణకేంద్రంగా మారుతున్నందుకు ఆశ్చర్యపడేది.

శీలం ఒకతూరి పతనమైనపుడు కట్టుబాటులో వుండాలని మనిషి ప్రయత్నిస్తే దానికి వీల్లు పల్లెల్లో కంటె పట్నాల్లో బహు తక్కువ. పల్లెటూళ్లో అట్టి వాళ్ల సంఖ్య బహుకొద్ది; ఏ సంసారులఇళ్ళలోగానీ ఉన్నప్పటికీ తల్లిచాటు పిల్లలుగానో, పెనిమిటిచాటు పెళ్ళాలుగానో, తమ ప్రవర్తనగురించి ఎదుటివాళ్లు నోగెత్తలేని యజమానులవంటి ఉన్నతస్థానాల్లోనో వుంటారు. పట్నంలో అలాగ్గాదు. మనం ఆ దృష్టితో చూడంగాని—అదేవృత్తిగా పెట్టుకున్నవాళ్లు అనేకమంది. దానిలోనూ పోటాపోటీలు, కడుపు కక్కుర్తులు, లాలసలు — ఒకటేమిటి ? అరీతులు అసంఖ్యాకం!

పట్నం జనంలో పెద్దమనుషుల్లో ఒకరకం, పోకిరీలు కొందరు, బ్రోకర్లు, రౌడీలు, పట్టుబట్టి వరహాలును రంగంలోకి దింపారు. మొదట్లో మోజుగానే వుంటుంది. ఎటుచూసినా గౌరవాలు, మర్యాదలు, డబ్బు, నౌకర్లు, చాకర్లు — అరచేతిలో స్వర్గం ఆడుతుంది. ఇదీ సంఘంపన్నిన కృత్రిమపువలలోని ఎరలో ఒకభాగమే. నెమ్మదిమీద అసలు రంగు బయటపడుతుంది. అయిదారు నెలలకు వరహాలు బ్రతుకు వందల రేటులోంచి రూపాయలకు పడిపోయింది. ఆమె అంటే లోకువ, తేలిక, నీచం— వొత్తి చప్పురకంగా ప్రజ తీసేస్తున్నారు. కాలం గడచినకొద్దీ ఆమెవద్ద కెవ్వరు రావడం మానేశారు. ఆమెనే ఇంట్లోంచి బయటకు లాగింది లోకం. ఇంకేముంది? మళ్ళీ అదేవరస. తాను మొదట్లోచూసిన వరస—తానా వరసలో ఒక్కతె. పార్కుల్లో, రైల్వేస్టేషనుదగ్గర, రెండో ఆట విడిచినతర్వాత సినీమాహాలుఎదుట తెల్లగా విరియబూసి పూవులు క్రిందకురాల్చే గానుగచెట్లనీడల్లో కారుస్టాండ్ల ప్రక్క ఆఖరుకు కిరాయిహోటళ్ల వరండాల్లో వరహాలు తచ్చాడడం మొదలుపెట్టింది. అభిమానం పులుముకొచ్చే ఆమెకు ఇది లోలోన కంటగింపుగానే వుంటోంది. అయితే ఏంచేస్తుంది? లోకంపె కసిదీర్చుకోడానికని భ్రమసి ఈ వృత్తి చేపట్టింది. కాని సంఘం సామాన్యమైనదా ? ఆమె ఆరోగ్యాన్ని, ఆమెశక్తినీ, సర్వస్వాన్ని నిర్దాక్షిణ్యంగా నిర్మూలించేస్తోంది. ఇటీవల ఆమెలోజీవితాన్నిగూర్చి అనేకమైన ఆలోచనలు, ఆవేదనలు కలతపెట్టడానికి తీవ్రంగా పోటీ పడుతున్నాయి. అయినా స్థాయి తప్పడంలేదు మనస్సు.

తుదకు వరహాలుకు రాత్రివేళల కొన్ని హోటళ్లలో తన్ను విక్రయించుకునే పద్ధతిమీద ప్రాప్రయి

టర్లకు కొంత కమీషను యిచ్చేకాడికి వచ్చింది ఆమె అవస్థ. బ్రతుకు గడుస్తున్నకొద్దీ రోజు కొక్కొక్క నూతన అనుభవం ఆమెకు కలుగుతోంది. అనుభవాలు కూడా ఆమె ఆసక్తిని సడలించకుండా బలాన్నే చేకూరుస్తున్నాయి. వివిధ మనస్తత్వాలు గల వ్యక్తులతో ఆమెకు సాంగత్యం లభిస్తోంది. అది తాత్కాలికంగా అయినా సరే ఆ కొద్దిగంటలలో వాళ్ళలోకి చూసి ఏవేవో స్వభావాలు వెదకడానికి ప్రయత్నిస్తోంది. తాను నిత్యమూ తీరిక సమయాల్లో తిరగేసే పత్రికల కథల్లోని వివిధ వర్ణాలుగల పాత్రలవలె ఆమె కట్టెదుట అనేకులు తేలిపోతున్నారు. వాళ్ళకీ ధ్యాస అన్నదే లేదు. సిగరెట్టు పీల్చి పారేసినట్టు, కప్పు కాఫీ త్రాగేసినట్టు, కిళ్ళీ నమిలినట్లు, కొన్ని ఘడియలు సినిమా చూసినట్లు, కొంచెంసేపు త్రాగుడు మైకంలో తూలినట్టు ఆ పడుచు సాంగత్యంలో గడిపేస్తాండేవారు కాలాన్ని.

వరహాలు దుఃఖమయ జీవితంలో, భ్రష్టమయిపోయిన బ్రతుకుబాటలో, మొద్దువారి తమో నిబిడీకృతమైన మహాయానంలో ఒకనాడు ఆమె అనుకోని అపూర్వ సంఘటన ఒకటి జరిగింది. అది బహు చిన్నదే. అనుభవం కొద్దిపాటి శకనులదే. అయినా అది జీవనసాగరాన్ని కలచివైచి పెనుతుపానును రేపింది ఆమెలో. ఏండ్లతరబడి వరహాలు గడించిన తెలివితేటలూ, ఆమె అనుభవం సంపాదించిపెట్టిన జ్ఞానము సాఫీగా తాపీగా ప్రయోగించవలసి వచ్చిన మధుర ముహూర్తం అది. ఆమెకు మళ్లీ ఎన్నేళ్లకో నిజమైన అవ్యక్తమైన ఆనందం, ఉత్సాహం, ఉద్రేకం కలిగించిన క్షణం.

ఆనాటిరాత్రి. పదిగంటలవేళ. హోటలులో. ఏకాంతంగా. కట్టెదుట ఒక యువకుడు—సంస్కర్తవలె వున్నవాడు—అవివాహితుడు. చాలా తెలివిగలవాడు, అందగాడు, మితభాషి—మీదు మిక్కిలి ఒక రచయిత—వరహాలు ఆశించదగ్గ పొందుగలదని భ్రమించిన పురుషుడు తటస్థపడడం. ఆమె అతన్ని పరీక్షగా చూచింది. అతడూ ఆమెను చూశాడు. తాను అతన్ని చూసినటు అతడు తనను చూస్తున్నాడా అని ఆమె అనుమానం! అతనితో మాట్లాడాలి. అతన్ని కదపాలి. అతడు జీవితంలో ఎన్నడూ అనుకొనివుండని ఊహాసౌధంలోని క్రొత్తగదులు తెరచి అతనికి క్రొమ్మెరుంగుల ఇంపు సొంపులు చూపించాలి. అతన్ని ముగ్ధునిచేసి తన సాధనలో జయం పొందాలి. అయితే అసలు అతడు చలించడం లేదు. ఇంక కథ ముందుకు సాగడం? ఇదే ఆమెను ఎదుర్కొన్న చిక్కు ప్రశ్న?

12

చిన్నకథ వ్రాసి క్లుప్తంగా ముగిద్దామనుకుంటే అనుకోనంతగా పెరిగి పెద్దకథై పోయింది. చిలవలూ, పలవలు వేసుకుంటూ ఊహా నభో వీధిలోకి తెగ ఎగ్రబాక ప్రయత్నిస్తోంది. ఒళ్లు భారంగావుంది. ఆవులింతలు తెగవస్తున్నాయి. మెడలు నొప్పిపెడుతున్నాయి మాపుడువ్రేలు బొటనవ్రేళ్లే కొసలు కదునుగట్టి ఇంక యెంతమాత్రం అక్షరాల్ని తిన్నగా వ్రాయలేక వంకర టింకరలు పడుతున్నాయి. అప్రయత్నంగా తలయెత్తి బల్లమీద గడియారంవంక చూశాను. "అబ్బా! ఇవ్వాళగూడా అతి త్వరగా గడిచిపోతూంది! అప్పుడే పది దాటింది. పరుగు బెడుతూన్న కాలానికి కళ్లెం తగిలిద్దామని ఉబలాటంతో నేదాన్ని తరగబెట్టుకుంటున్నట్లుంది. నే నిక్కడకొచ్చి రెండురోజులు పూర్తి అవుతాయి. ప్రొద్దుట వుంటానో వుండనో అనుకుంటూ అదే చెబుతా కాబోలు అనుకొన్న ప్రొప్రయిటరు ప్రశ్నార్థకంగా ఉదయం నావైపు చూశాడు. వాడికి నన్నుగురించి అనుమానం కలిగివుంటుంది.

నిన్నటిరాత్రి రజని వెళ్లినప్పటినుండి ఏకబిగిని వ్రాతలో ములిగివున్నందువల్ల ఈ గంటలన్నీ ఎలా కరిగిపోయాయా అని ఆశ్చర్యం కలుగుతోంది. స్వప్నంలో జరిగిన సంఘటనలవలె ఈవాళటి పగటిపూట తటస్థించిన అనుభూతులు కొన్ని లీలగా నాయెదుట మెదలసాగాయి. రాత్రి అంతా కంటికి కునుకన్నదిలేక వ్రాతలో ములిగివున్న నన్ను, ఒక ఆగంతుకుణ్ణిచూసి హోటలు ప్రొప్రయిటరువంటి వాడే అనుమానిస్తే సర్వర్లమాట వేరే చెప్పాలా? ప్రొద్దుట టిఫెను తీసుకుంటూంటే సర్వరు అన్న మాట బాగా గుర్తుకొస్తోంది.

"అలాగున్నారేం బాబూ?"

"రాత్రి అసలు నిద్దరే లేదు—ఎలాగుంటుంది మరీ"

"ఈవూళ్లో రజని అనే ఆమెను నువ్వెరుగుదువా" వాణ్ణి అడిగాను.

"ఆమేఁ—ఆఁ—ఆఁ—అదీ ఫలానాచోట వుంటుందని చెప్పలేంబాబూ! వెనక కాన్వెంటు స్కూలుపక్క సందులో వుండేది—ఏం—దాని గొడవ ఏమొచ్చింది?" వాడు ఎంతో ఆత్రుతను వ్యక్తంచేస్తూ ముఖ్యంగా నన్నుగురించి ఆందోళన చెందుతున్నట్టు స్పష్టమైంది నాకు.

"అయితే ఆమెకో యిల్లూ వాకిలీ లేదన్నమాట! మరెక్కడ వుంటుందీ?"

"అదేంటండీ అలాగడుగుతారు? పగలల్లా బజారులూ, రోడ్లూ వున్నాయిగదా—రాత్రి కేసత్రమో, హోటలలో వుండనేవుంటుంది. తమ రెక్కడచూశారు. దాన్ని?" బిల్లుయిచ్చి వెళ్లేవాణ్ణి పనుంది పైకి రమ్మనమని పిలిచాను. ఆశ్చర్యపడుతూనే వాడు నన్ను వెంబడించాడు.

"రాత్రి రజని ఇక్కడికొచ్చింది" ఈముక్క నానోట వినడంతోనే వాడికి ముచ్చెమటలు పోశాయి.

"అయితే—మీతో" ఎంత ఆత్రుత! ఎంత భయం వాడికి?

"ఆఁ—నాతో ఇక్కడే వుంది రెండు గంటలదాకా. అది ఈరాత్రికి ఇక్కడకు మళ్లీ రాదూ?"

"రాకేం—వస్తుంది. మీరున్నారని తెలిస్తే రెక్కలుగట్టుకు వాల్తుంది. రుచి మరిగితే"

"ఏమిట్రా నువ్వనేది?"

"ఏమీ లేదండి. కాలం అలాగుంటుంది. మంచికిబోతే చెడు ఎదురౌతుంది. మీరేమనుకున్నా సరేగాని మీరు దానిజోలికి పోకండి. చిన్నతనం. వచ్చింది పోరుగూరు". నన్ను అపార్థం చేసుకోకపోతే వాడలాగ సానుభూతి ప్రకటిస్తాడా?

"ఏం—రజని అంత కానిదా?"

"నెమ్మదిగా అంటున్నారా. ఈవూరు మొత్తం మీద అలాంటిరకం లేదు. పైన మీ ఇష్టం" అంటూ జారుకున్నాడు క్రిందికి.

మళ్ళీ ఇదే వ్యాఖ్యానం. నేను భోజనం చేస్తుంటే నవ్వుకుంటూ సర్వర్లు కూడ బలుక్కుంటున్నారు. "ఇంకేముందిరా? వలలో వేసిందిరా పిట్టను. ప్రొద్దుటనే చెప్పానుగూడా" ఇవ్వాళ ప్రొద్దుట నేను కదిపినవాడి గొంతు ఇది. రెండోవాడు తానేదో ఘనకార్యం చేసినట్టు వెకిలిగా నవ్వుతున్నాడు. పైకి వచ్చాను. రజనినిగురించి నేనూహిస్తున్నదీ, రచిస్తున్నదీ రైటే అని స్థిరీకరించుకున్నాను. ఉదయం సంభాషణ, మధ్యాన్నం వాళ్ల సణుగుడు నా కథకు మరీ పసగూర్చి మంచి ఊపుతో ముందుకు తీసుకెళ్లాయి. ఎలాగైనా రజనిని జయించగల్ను. ఆమె కథను ఆమెకే వినిపించి అపుడు దీని ప్రభావం ఎలా వెలుగుతుందో చూడాలని ఉవ్విళ్ళూరింది నా హృదయం. సరిగా నిన్న రాత్రి ఇదే సమయానికి నా భావ జలధిలో తరంగాల రాకపోకలు తుపాను సూచనల్ని చూశాయి. గడియారం చేసే 'టిక్ టిక్' శబ్దంతప్ప ఇంకేమీ సద్దులేదు. చుట్టుప్రక్కలనుండి ఎవళ్లో లుడుంకునవచ్చి నన్ను ఇబ్బంది పెట్టకుండా తలుపు గడియ గట్టిగానే బిగించి వుంచాను. మళ్ళీ ఆవులించి వొళ్లు విరుచుకుని కలం తీశాను.

తలుపు చప్పుడు. నిశ్శబ్దంగా విన్నాను. మళ్లీ చప్పుడు. ఇంకెవరు? ఆమెయే వచ్చివుంటుంది. వెంటనే తలుపు తీశాను. రజని—ఆమే—అదే నిశ్చలత్వం. అదే గాంభీర్యం! వస్తూనే ఆమె తన ముఖాన్ని నా కళ్లయెదుటవుంచి తీవ్రంగా చూసింది.

"రా—కూర్చో. ఇవ్వాళ రావేమో అనుకున్నాను."

"ఔను—రాకూడదు అనుకున్నా. కాని మీరు నేను మళ్లీ ఈ గదిలో ప్రవేశించే పరిస్థితుల్ని కల్పిస్తారు అనుకోలేదు" జాలి నభినయించింది.

"నేనేమీ కల్పించలేదే."

"ఈ రోజుల్లో ఎంత పెద్దవాడికైనా ఇదోటి అలవాటయ్యింది. సులువుగా, నవ్వుతూ అబద్ధం ఆడడం" ఆమె ఏ అధికారంతో నాపై ఈ నేరం మోపిందీ? ఆలోచించసాగాను. నిన్నటి రాత్రినుంచి రజని యెదుటబడితే మాత్రం జాగ్రత్తగా మాట్లాడాలనుకున్నా. ఆమె నాలాగ అధికురాలు కాదని తోచవచ్చు నా హృదయంలో ఒక భాగానికి—నావలె ఉన్నది కాకపోవచ్చు—కొద్దిపాటి సొమ్ముతో ప్రకోపితమైన అహం—నేను ఆమెకంటె బాగా చదువుకున్నాననుకోవడంలో లోకపురీతినిబట్టి నా చలం ఏమీ అతిశయించలేదనవచ్చు. వీటన్నిటినీ

మించి ఆమెవద్ద వీటన్నిటినీగూడా త్రోసి రాజ నగల అనుభవం వుండకూడదంటావా? అంటుంది ఇంకొక భాగం హృదయంలోంచి. ఏమీ లేకుండా ఆమె కింత ధీమా ఎక్కడనుంచి వస్తుంది?

"నేనేమీ అబద్ధం ఆడలేదు."

"నాదగ్గర కబురు చేరకపోతే ఇంకా బుకాయించేద్దురు." ఆమె నవ్వింది.

"రజనీ—నీవు చాలా చిత్రంగా మాట్లాడుతున్నావు. నీకు చెప్పినవాడేవో కాని కూతలుకూసి వుంటాడు."

"కొత్తవాళ్లూ, తెలియనివాళ్లు అయితే అలాగే అనుకొందును. ఇక్కడిరకాలు ఎంత దమ్మిడికీ, సిగరెట్టుకి కక్కుర్తిపడేబాపతైనా కొందరు నిజాయితీపరులు లేరనుకోకండి. మీరు ప్రొద్దున్న ఒక మనిషి దగ్గర మీరు చెయ్యని నీచపుపనినిగురించి — ఏదో ఘనకార్యం చేసినట్టు చెప్పుకోలేదూ?"

ఏదోదూరంనుండి స్ఫురణకు వస్తోంది కొద్దిగా. దాన్ని ముందుకు రానియ్యకుండా నవ్వు అడిమి పెడుతోంది. తుదకు ఆమెకు ప్రత్యుత్తర మియ్యకుండానే నవ్వేసి "రా—అలా నుంచున్నావేం? అదా సంగతి? నువ్వు నిజంగా పొరపాటు పడ్డావు" అన్నాను.

ఆమె నెమ్మదిగా సమీపిస్తూనే "ఇంక చాలు. రాత్రి రెండుగంటలదాకా మీరు నాతో గడిపినట్లు సర్వరుదగ్గర అనలేదూ?" అంది.

"ఓ! అదా—పొరబాటు. వాడు చేరవెయ్యడం లోనో, లేక నువ్వు అందుకోవడంలోనో కొంచెం తోక పెరిగింది అసలుమాటకి—కూర్చో—చెబుతా. ఇలాంటివే ఎంతెంతో పనులు చేస్తుంటాయి. ఇప్పుడు కొంప మునగలేదనుకో—కాని ఇంత చిన్న గొడవలు ఒక్కొక్కప్పుడు పెద్ద అనుమానాలకు, భయసందేహాలకు దారితీసి, రాద్ధాంత సిద్ధాంతాలకు నడిపించి పెద్ద కథల్ని సృష్టిస్తుంటాయి. ఇంతకీ నేనన్నది "రాత్రి రెండింటిదాకా రజని ఇక్కడే వుందిగా" అని. వాడు దాన్ని వ్యాఖ్యానించుకున్నాడు. భలేపని జరిగిందిలే" ఆమె ముఖంలో నిన్నరాత్రినుండి తొలిసారిగా ఇప్పుడే పరాజయ చిహ్నం తొణికిసలాడింది.

క్షణంసేపు ఆమె ఏమీ మాట్లాడలేదు. మనస్సు నతితీవ్రగా స్థాయికి తెచ్చుకుంది. పెదిమలపై చిరునవ్వు చిందించింది. నేను చూపినచోట ఒద్దికతో నాకు తెలియడంలేదేమో అనుకుని నన్ను పరిశీలిస్తూ కూర్చుంది.

"ఒక్కటి చెప్పండి. నేను నిన్న ఇక్కడనుంచి వెళ్లిందిలగాయతు మీరు నాపైనే ధ్యాసపెట్టుకుని వున్నారా లేదా? రాత్రి అసలు నిద్ర అన్నది రాలేదుగా?". ఈ మాటల్లో ఆమె నిజంగా నేను భావిస్తున్నట్లే దారికి వస్తున్నట్లు తోచింది. తప్పక ఆమె వలలో పడుతుందనీ, అదను చూసుకొని ఆమె కెలాగైనా ఉపదేశించి ఆమెను పడుపువృత్తిలోంచి పెడత్రోవబట్టించాలనీ పథకం వేసిన నాకు జయం లభిస్తున్నట్లనిపించింది. ఒకందుకు ఆమె తననుగూర్చి మథనపడుతున్నాననుకుంది. ఆమె మనోవీధిలోని మబ్బుతెరలు తొలగించడానికి—"ఔను. నీవు వెళ్ళిన తర్వాత అన్నీ నిన్నుగురించినవే ఆలోచనలు. కంటికి నిదుర లేదంటే నమ్ము. నువ్వు సామాన్యమైనదానివా రజనీ?" అన్న నన్ను చూస్తూ ఆమె ఏమనుకుందో—చటుక్కున స్వరంమార్చి, "నన్నుగూర్చి అంతగా ఆలోచించకండి. ఏమిచేసినా ప్రయోజనంలేని స్త్రీకై వ్యథచెందడం మంచిదికాదు. మీబోంట్లు అసలే ఆ బాధ పడకూడదు." యథార్థంగా ఆమె ఎదలోనుంచేనా ఈ మాటలు వెలువడుతున్నాయి? లేక నటనా? అని తర్కించుకోసాగాను. రజని తలుచుకుంటే ఎలాంటి పాత్రనైనా తేలికగా పోషించగలదు.

నేను మౌనంగానే వున్నా. ఆమే కదలించింది. ఒకే ఒక వాక్యం బరువుగా అన్నది "నన్ను మరచిపోండి"—లేకుంటే ఇదొక వ్యాధిగా పీడిస్తుంది మిమ్మ అనే హెచ్చరికతో కూడిన భావంవంటి మెరుపును కళ్లలో ప్రకటిస్తూంది. నాకు ఇప్పటికీ ఆశ్చర్యం కలిగించేది ఒకటే—నేనంటే జాలి, కరుణ ధ్వనిస్తున్నాయి ఆమె స్వరంలో. తద్వారా నాకు గౌరవం వస్తోంది. అందుకే నాకు ఆమెయెడ అనుమానం బలమయ్యింది.

"అలాగనకు రజనీ! నాకు అటువంటి బాధలు పొందే అలవాటు లేదు. ఇప్పటివరకు జీవితంలో అట్టి ముహూర్తం రాలేదు. నాలో కలిగించిప్పుడొక

విశేషం. నిన్ను నేను ఎన్నటికీ మరువలేను. దీనికి కారణం నే ననుకుంటున్నదీ, నువ్వనుకుంటున్నదీ ఒకటిమాత్రం కాదు"

"అహాఁ! మీ రేమనుకుంటున్నారో!" లీలగా కిలకిల నవ్వుతూ అన్న యీ ఆశ్చర్యార్థకం నన్ను కొంచెం కలచినమాట వాస్తవం. అయితే మటుకు, నా ధైర్యం నాది.

"రజనీ! నిన్న నీవు నన్ను వదలినప్పటినుంచి నా మనస్సు నీమీదా, నీవంటి యితర వ్యక్తులమీదా పనిచెయ్యడం ప్రారంభించింది. నువ్వు చేసేపని నాకు సవ్యంగా కనుపించలేదు. కనుక ఇట్లాంటి వ్యక్తి చరిత్రను ప్రపంచాని కెరుకపర్చాలని తదేక దీక్షతో ఒక రచన సాగించాను." నామాటలు వింటూ నివ్వెరపడి నవ్వడం మొదలుపెట్టి "బాగానేవుంది. నేను, నా బ్రతుకు, నా వృత్తి—రచ్చకుకూడా ఎక్కిస్తున్నా రన్నమాట. అదేమంత ఘనకార్యమనీ...?" ప్రశ్నించింది.

"నీకు తోచకపోవచ్చు. నాకుమాత్రం ఎంతో విశ్వాసం వుంది—దీన్ని చదివే పాఠకు లందరిలోను కనీసం ఒకరిలోనైనా ఈ కథ మార్పు తేలేదూ? పోనీ తేలేకుంటే మానె. ఘడియసేపైనా ఇది వాళ్లను ఆపి ఊపిరి తీయడానికి కూడా వీల్లేని పరిస్థితిలో నిలబెట్టి నీవంటివాళ్లనుగూర్చి ఆలోచించమని కోరదూ?"

"మీరు కవులూ, కథకులు. ఎప్పుడూ ఊహాపథంలో విహరిస్తారు. మీ భావ వీధికీ, వాస్తవానికీ భూమ్యాకాశాలమధ్య ఉన్నంతటి అంతరంవుంది" మళ్ళీ నవ్వుతూనే అంది.

"అలాగనకు—కావలిస్తే విను. ఒక్కటే షరతు. నిన్నెంతమాత్రమూ ఈ కథ కదల్చకపోతే దీన్ని నీ యెదుటనే దగ్ధంచేస్తాను." ఆవేశంతో అన్నాను. ఆమె లోకువ చేస్తుందేమో అనే జంకు కూడా లేకపోలేదు. ఆమె ఏం చేసినాసరే—నా మనస్సు ఏవగించుకోదు. ఒక్కటే నేను కోరేది. నన్నూ, నా కృషినీ గురించి ఎవ్వరేమనుకున్నా దిగులులేదు. వాళ్లకు తెలియకుండానైనాసరే నామాట వాళ్లలో లేశమైనా ఉత్సాహం లేవదీస్తే "నేనే జయించాను" అనుకుంటాను.........

13

"చదవండి! అదెంత సజీవమైనదో వింటాను" అని కుతూహలంతో రజని ముందుకు జరిగింది. మధ్య మధ్య ఆమె ముఖంలోకి, కథ వింటూంటే ఆమె ఎలాతలపోస్తోందో అని పరికిస్తూ, నిన్నరాత్రి ప్రారంభించి ఆఖరికి ఇవాళ రేడియో కార్యక్రమానికికూడా వెళ్ళకుండా యెకాయెకీని చిత్రించిన, ఆమె కథ ఇలాగే వుంటుందని భ్రమించి వ్రాసిన, కథంతా ఓపిగ్గా చదివాను. ఒకడు తను కథ వ్రాసినపుడు, ఒకవ్యక్తిని మనసులోవుంచుకొని ఒక ప్రత్యేక ప్రయోజనంకోసం రచన సాగించినపుడు, అదేరచన వాడు సావధానంగా వింటూ తనకల్పనకు ఆశ్చర్యం ప్రకటిస్తూంటే ఎంత ఆనందిస్తాడో దానికంటె ఎన్నోరెట్లు ఎక్కువగా సంతోషించాను నేను. కథ ముగించి కాగితాలు మడిచి బల్లమీద వుంచాను. ఆమె సుదీర్ఘమైన ఒక వేడినిట్టూర్పు విడిచి కొద్ది నిమిషాలు నిశ్శబ్దంగా వుంది. బహుశా కథ జ్ఞాపకంలో బడి ఎక్కడెక్కడో చెదరి బెదరిన హృదయాన్ని కట్టుగ్రకు చేర్చుకోవడానికి ఆపాటివ్యవధి ఆమెకు చాలిందా అని నా అనుమానం!

"ఎలాగుందీ కథ?" సంపాదకులముందు రచయిత తన రచనను ముగించి మడుస్తూ వేసే జిలుగైన ప్రశ్నకంటె, సినిమా ప్రొడ్యూసరును, డైరెక్టరును గంటలతరబడి బలవంతంగా కూర్చోబెట్టి వారు తియ్యబోయే చిత్రానికై కథకుణ్ణనుకుంటూ వచ్చి చదివి వినిపించి వారి అభిప్రాయానికై జాలిగా వేసే ప్రశ్నకంటె బలీయమైనది నా కాంక్ష. ఆమె మనసులోంచి వెలువడే పలుకులు వినాలని కుతూహలం ఇనుమడించి ఆమె ప్రత్యుత్తరంలోని ప్రథమ స్వరంకై చెవులు నిలుచున్నాయి. అయితే ఆమె ఆ మాటలు నిజంగా తన ఎదలో సంప్రదించుకొని ఇచ్చిందా?

"అబ్బ! ఎంత గాథ వ్రాశారు? ఇదంతా నామీదే?"

"నీమీద గాదు. కాని దీనికి స్ఫూర్తి నీ కలయిక."

"ఔను- నేనూ అనుమానించాను నిన్నరాత్రి—ఏదో ఈయనలో కలత బయలుదేరి వుండాలని"

"అసలు ఇందులో వస్తువు నీ హృదయాన్ని తాకనే లేదూ?"

"తాకకేం?—అందులోను మీరు నిజమనుకున్నది ఎంత చిత్రంగా, తిన్నగా ఎదటివాడి మనసుకు వచ్చేటట్లు వన్నెచిన్నెలతో చెప్పారు!" నాకు కొంచెం తృప్తిని కలిగించిన దీ విమర్శ. రజని ఆలోచించి ఒక సూటిప్రశ్న వేసింది "మీరు సంస్కర్త లనుకుంటాను?"

"ఏదో ఇతరు లనుకుంటారు. అంతే" నా మాటలు విని ఆమె ముఖం అదోకలాగు పెట్టింది. ఆ పోలికలో "చాలామంది కిదొక జబ్బు. లేనిదిఉన్నట్టు తమపై ఆపాదించుకోవడం, నిజంగా ఉంటే తమకేదీ రాదన్నట్టు—తామేమీ లేనివాళ్ళం అని మొదలేసి తుదకు తమ ఘనత అద్భుతంగా నిరూపించుకోవడం" అనెడి చురుకు ఆ లేడికళ్ళను మరపించే నయనాల్లో దాగివున్నదా అని నా భ్రమ.

"నిజంగా సంస్కర్త మీలోనుండి ఆవేదనను వ్యక్తపరచడానికి తపన పడకుండావుంటే మీనుండి ఇలాంటి రచన రావడం జరగదు"

"........." నా మౌనం.

"మీకథ నిజమైనా కాకపోయినా విన్నవాళ్లను తనతో లాక్కెళ్ళడానికి ప్రయత్నిస్తున్న దన్నది యథార్థం" మాటలు తెలివిగా మెలత వేసింది.

"మీలాంటివారు ప్రపంచంలో ఎక్కడోగాని వుండరు. మీ దర్శనం లభించడం నా అదృష్టం" రజని నిజంగా బాధపడి అంటోందా? లేక ఇదీ ఆమె ఎత్తేనా?

"రజనీ! నిన్ను చూస్తే జాలికలుగుతోంది సుమా!"

"ఔను. హృదయమున్నవాళ్లి కది సహజం."

"నువ్వు ఈదారి వొదిలెయ్యడాని కింకే మార్గమూ లేదూ?"

"లేకేం—ఉంది. అయితే లోకం ఇంకా అంత ముందుకు...."

"ఎంత ముందుకూ?"

"చెప్పేవే చేసే వైపోయేటంత ముందుకు."

"జాగ్రత్తగా ఆలోచించు. పరువుగా బ్రతికే ఆస్కారమే లేదంటావా?". ఈ నామాటలు ఆమెను ఉద్రిక్తపరచి వుండాలి. ఒక్కసారి కదలి, కళ్ళు త్రిప్పి పౌరుషం వచ్చినట్లు,

"లేకేం—ఉంది. నిష్కల్మష హృదయంతో నాకు చేయూతనిచ్చే ఆసరా వుండాలిగా?"

"పరిశుద్ధమైన అంతఃకరణతో కృషిచేస్తే అది నీకు దుస్తరంకాదు."

"అనుకునేటంతటి తేలికగాదు కూడాను."

"రజనీ! లేదు. నీవు పొరపడుతున్నావు."

"కాదండి. క్షమించాలి. ఏళ్లతరబడి అనుభవం నాలోంచి మాట్లాడుతోంది."

నటన నభినయించే రజినిలోనుండి అభిమానం గర్జించింది.

"లోకం మనం అనుకుంటున్నంత గ్రుడ్డిదీ, క్రూరమైనదీ కాదు."

"ఆ సూత్రం అందరికీ వర్తించదు."

"పోనీ—నీ కభ్యంతరం లేకపోతే నే నొకటి"

"మీకూ అభ్యంతరం లేకపోతే నేనూ ఒకటి"

ఓహో! ఏమిటీ గాంభీర్యం! ఎంత పటిష్ఠమైనదీ సన్నివేశం! నువ్వంటే నువ్వని సరి వుజ్జీగా రజని బరిమీదకు వచ్చేస్తోంది. సరే—కానీ. ఆమె ఎంతదాకా వస్తుందో చూద్దాం ఆమెది అనుభం—నాది తర్కం. రెండూ హోరాహోరీని తలపడ్డాయి.

"నేనా? నీకు??"

అవును. మీరే. సంస్కర్తలు. కొంచెం ధైర్యంతో దీనులైనవాళ్లకు చేయూత నివ్వండి. మీకంత అసాధ్యమైన దేదికాదు."

"ఏమిటి రజనీ! నీవడిగేది?"

"మీరు యువకులు. సమాజానికి ఎదురీదగలవార మని రొమ్ము విరుచుకు చాటుకుంటారు. ఒక పతిత. ఒక దీనురాలు, ఒక కులట, ఒక నీచురాలు, ఒక అనాథ—సమాజం బలంగా పాతాళంలోకి అణగ ద్రొక్కేస్తూంటే అణగి మణిగి వుంటూనే ఆకాశం దాకా ఎదిగే ఆకాలంకోసం అర్రులు చాచే ప్రాణి—బహు చిన్న మేలు కోరుతోంది".

నా హృదయం ద్రవీభవించడం ప్రారంభమైంది.

"ఇంక నన్ను బాధించక చెప్పు"

"మీ పరమపవిత్రమైన హృదయంలో విశాల ప్రపంచాల నెన్నింటినో విస్తరింపజేసుకొన్న మనస్సులో నాకిసుమంత తావిస్తారా?"

..."ఏం—అలాగ చూస్తున్నారు? పడిపోయిన నన్ను లేవదియ్యండి. మీవద్ద అన్ని అవకాశాలూ వున్నాయి. యువకులు, బ్రహ్మచారులు, నాకంటె పెద్దలు, విద్యాధికులు, ఆదర్శాలు ఆచరణలో ప్రతిబింబింపచేయగలవారు — చూడండి! మీ హృదయసౌధంలో ఏ ఒక్క మూలలో ఏ పాడుపడి బూజు పట్టినగదినో యిప్పించండి. దాన్నే మందిరంగా మార్చుకుని హాయిగా కతిపయజీవితాన్ని ఆకలిదప్పులు మరచిపోయి దొర్లించేస్తాను". రజని ఇంకా నన్ను ఖూనీ చేస్తోంది. ఇప్పటిదాకా ఎక్కడ దాక్కున్నాయో, ఏమైపోయాయో ఆదర్శాల యెండమావులు కట్టెదుట ఎగరడం మొదలుపెట్టాయి. ఉపన్యాసాలలో దంచిన నీతులు, గీతాల్లో హృదయం నుంచి తేల్చిన భావాలు అప్సరసల్లాగ నృత్యం చేస్తున్నాయి. అయితే హృదయంలోంచి ఒక గొంతు వినిపిస్తోంది. "అంతా మరిచిపో. సంఘం సమాజం వీటికి దిగవకు. ప్రాజ్ఞుడవు. వింటే వింటారు తల్లిదండ్రులూ బంధువులూను—లేదూ—వీడు నా కడుపున చెడబుట్టాడు అంటుంది తల్లి. సంఘంలో ఒక ఉచ్ఛిష్టం అంటారు పెద్దలు. నిన్ను ఏరి పారేస్తారు. కడజాతి దానికన్నా కనాకష్టమైన వ్యభిచారిణితో చరిస్తున్నాడని పొడుస్తుంది. ఫర్వాలేదు. సాహసించి ఆమెకు చేయి అందియ్యి. చేవ చచ్చిపోయిందని నిరుత్సాహపడుతున్న ఆమెలో నవజీవనం నెలకొల్పు. చిదికి, జీర్ణమై విధం చెడిన సమాజంలో నూతన తేజం నింపు" వెంటనే పెనుతుపాను కెరటంలాగవచ్చి మొదటి ఆలోచనలను బలంగా వొడ్డుకు నెట్టేస్తోం దింకొక ఊహ. "ఛీ! నీవు ఆదర్శపురుషుడవు కావాలంటే దారి అదికాదు. నీకో ధర్మం వుంది. దాన్ని నీవు పాటించాలి. అదే నీ కర్తవ్యం. అంతేగాని ఇట్టి విషమావస్థలో బేలవై క్లైబ్యంలో తూలిపోతే ఎట్లా? ఒక్కొక్కప్పుడు వస్తుంటాయి జీవన్మరణ సమస్యలు. అపుడే నిలువరించాలి. ఆమె నిన్ను వంచిస్తోంది. మేలుకో. ధర్మం పేరిట, నీతినియమాల పేరిట, మానాభిమానాల మాటున ధర్మాన్నే అపహసిస్తోంది" ఎటూ తెగిపోని సంఘర్షణ ఇది.

"మీ మనస్సును కష్టపెట్టేనేమో క్షమించండి" రజని మెల్లగా అంది.

"కాదు. కష్టం ఏమీ లేదు. నువ్వు చెప్పినట్లు కొంచెమేం? చాలానే తావు ఇవ్వవచ్చు" వెంటనే ఆశాకిరణాలు ప్రసరించే నేత్రాలతో నా ముఖంలోకి తొంగి చూచింది రజని.

"కాని రజనీ! ఒక నియమం వుంది."

"ఏమిటో?" ఈ ప్రశ్నలో ఎంతటి లాలస!

"నేను వివాహం చేసుకోనని నిశ్చయించుకున్నాను ఏనాడో. ఒక పరమపవిత్ర కార్యానికి నా జీవితం పణంగా అర్పించబడింది. ఇంక ఎన్నడూ నేను దాన్ని తప్పను". ఆమె నామాట నెలాగ విన్నదో ఏమో చటుక్కున వొత్తిగిల్లి "మీరు ఇలాంటి ఒక్క సూత్రంకోసం మీపంథా మార్చుకోడం లేదే—ఇలాటి వంపెలు, వేలు సూత్రాలతో బంధింపబడి బందీయైపోయిన సమాజం కించిత్తైనా ఎందుకు కదలాలీ? కదలదు. అమాయకుల్ని, అవినీతిపరులంటూ, అనాథుల్ని కాల్చుకుతింటుంది. మంచిదే. కాని ఇంకముందెప్పుడూ ఎవ్వరినీ ఏ విధంగాను ఆశ పెట్టడానికి ప్రయత్నించకండి"—తుదిమాట కొంచెం కోపంగా త్రుంచివేసింది.

"ఒక్కటిమాత్రం మళ్ళీ ఆలోచించండి. నిష్పాక్షిక దృష్టితో. ఏకాంతంలో, ఇలాగే మీ ఎదుట ఒక కన్యను, అందాలబరిణెను చూశాననుకోండి. మీ మనసు ఎలాగుంటుందో యథార్థం చెప్పండి. సంతోషంగా వెళ్ళిపోతాను."

నేను మౌనం వహించాను. ఆమె దాన్ని అర్థాగీకారంగా తీసుకొంది. త్రాచుపాము పడగెత్తినట్టు తల రోషంతో ఎత్తి నావంక తిరిగి బుసలు కొడుతున్నట్టు ప్రారంభించింది. "ఎప్పుడూ ఎవరినీ ఇంక ముందు వంచించకండి. నేను వ్యభిచారిణినని, పతితనని, కులటనని నాస్థితి చూసి మీరు వాస్తవంగా బాధపడ్డారని భ్రమించాను. పొరపాటుపడ్డాను! దయయుంచి సంఘాన్ని మరమ్మతు చేస్తామనీ, ఆదర్శాలు ఆచరణలో చూపుతామనీ ఉపన్యాసాలివ్వకండి. రచనలు కూడా మానెయ్యండి. మనం చెప్పేవి చెయ్యగలం అనే ధైర్యం లేకపోతే నోరు మూసుకోవడం మేలు. పాపం! మీరు ప్రవచించేవన్ని నిజంగా విలువైనవని

ఆ మాయలోపడి లేత్రబాయపు యువతీ యువకులు ఆదర్శాలనుకుంటూ వెర్రిగా వెంబడించి అవి ఎండమావులు కాగా విలపిస్తారు."

నేను ఆశించినట్లు గాక కథ అడ్డంగా తిరిగింది. మొదటి నుంచీ ఆమె ఆడుతున్నదంతా కపట నాటకమే అని కానుకోలేకపోయాను. ఆమె వ్యాఖ్యానం వల్ల నాకు కోపం గలిగింది. "ఇంక చాలించు—నువ్వేం మాట్లాడుతున్నావో నీకు తెలుసా?"

"ఆహా—తెలుసుకు నే మాట్లాడుతున్నాను"

"ఇంకా ఏదో సాయంచేసి నిన్ను ఉద్ధరిద్దామనుకుంటే"

"మహా సహాయంచేశారులెండి. ఉద్ధరించనక్కర్లేదు."

"అయితే దయచేయ్ పెందరాళే"—రజని నటనకు తగిన స్వస్తివాచకం నానుండివచ్చిందని గర్వించాను. ఆ దెబ్బతో ఆమె కృంగిపోయివుండాలి. అవమానంతో వంగిపోయివుండాలి. అవును. అదిగో! అలాగే జరిగింది. అవిగో కన్నీళ్లు! దీనత్వం! ఆమె లేచింది. రోషకషాయిత నేత్రి, సజలనయన—రజని అభిమానం వెళ్ళగక్కుతూ మొదలు పెట్టింది. "సెలవు వెళ్తొస్తాను. కాని—క్షమించండి, నేను కొంచెం గురుసుగా మాట్లాడుతున్నట్టుంటే; మీ కెంతకష్టంగా వున్నా సరే సమయంవచ్చింది కనుక నేను ఖచ్చితంగా చెప్పాలి. లేకపోతే అది నా తప్పు" అని గర్జించడంలో రజని నిజస్వరూపం మెఱుపులా వెలిగింది నా ముందు. ఆ కాంతికి తట్టుకోలేక కళ్లు జిగేల్ మని మూతలుపడ్డాయి. ఆమె వచించే నగ్నసత్యాలను గొంతు ముడి హాలాహలంకన్న చేదుగా మింగింది. ఆమె ఉదహరించే ప్రతిమాటా నన్ను కదల్చి వూపి వూపి పడగొట్టేలా గున్నాయి. అది ప్రసంగంగాదు ఝంఝూ మారుతం.

"నన్ను సంఘం, లోకం, మీ మనస్సు—వ్యభిచారిణి, పింజారీ, కులట అని వ్రేలెట్టి చూపుతున్నయ్. ఇంక ఎంతమాత్రం దీనికి నిలవ నీడలేకుండా లోకం వెలివేసింది. నిజమే. నేను వ్యభిచారిణిని. పాడిచెప్పాను. కాని మీరు—సరిగ్గా ఆలోచించుకోండి! మీరు చేసేది వ్యభిచారం కాదా? గుండె మీద చెయ్యివేసుకు మిమ్మ మీరే ప్రశ్నించుకోండి. ఇంతదాకా మీరు చదివిన గాథ ఏమిటండీ? సంస్కర్తలట! సంస్కర్తలు బయలుదేరారు సంఘాన్ని మరమ్మతు చేస్తున్నామంటూ దాన్ని కొల్లగొట్టుకు పీల్చుకుతినడానికి. పైగా మీరచనల్లోను, ప్రసంగాల్లోను, మేము సమాజానికి వేరు పురుగులమనీ, సమాజాన్ని పీల్చి పిప్పిచేసేస్తున్నామనీ విషం వెళ్ళగక్కుతున్నారా? సూటిగా ప్రశ్నిస్తున్నా — మీరు చెప్పే అసత్యంలో చేసే వ్యభిచారంలో నేనుచేసేది ఎన్నోవంతు చెప్పండి? మాట్లాడరేం — లోకాన్ని అనుభవంద్వారాగాని, పరిచయంద్వారాగాని, పరిశీలనద్వారా గాని చూడరు. సాహిత్యారాధకులం అంటూ మీకున్న దుర్బుద్ధుల్ని కవితలు, కథలు, నవలలు అంటూ తెగవ్రాసి అమాయకమైన పాత్రలకు అంటగట్టి ఆ కంతలో ప్రజల్ని మూసి సొమ్ము చేసుకోవడంలేదూ? ఇపుడు మీరు వ్రాసిన కథలో స్త్రీనిగురించి వివరించారు. ఎపుడైనా స్త్రీమనస్సులోగాని, ఆమె భావనలోగాని ప్రవేశించి ఆమె ఇలాంటిదని నిర్ణయించుకోగలిగారా? అసలు మీకు దాన్ని చూడగలశక్తివుందా? లేకపోతే వూరుకోవాలి. అంతేగానీ తగుదునమ్మా అని కలం బుచ్చుకుని కానికథలు వ్రాసి, చూనుపరాని వూహాలు ఏపాపమూ ఎరుగనివాళ్లకు అంటగట్టి పుస్తకాలు ముద్రించి ప్రజల్లో బహిరంగంగా, బాహాటంగా అమ్ముకుంటూ సిగ్గువిడి సమ్మానాలందుకుంటూ సరస్వతికి మీరు చేసేద్రోహం ఇంతా అంతా వుందా? సమాజానికి అది ఎక్కువ హానికరమా? ఒకవ్యక్తి చెడునడత ప్రమాదకరమా? మీ అసత్యాలనే నిజమనుకొని నమ్మి అమాయకులైన బాలబాలికలు, యువతీయువకులు, మీ విషపూరిత ఆశయజ్వాలల్లోబడి, ఆ మాయావాగురంలో తగుల్కొని మీకు 'జీ హుజూరు' అంటూంటే రొమ్ము విరుచుకొని వీధులంట తిరుగుతారా?"

క్రోధంతోబాటు ఆమెకు దుఃఖం గూడా వచ్చింది. ఇదంతా విని నాకు మూర్ఛవచ్చినట్లయింది. తెలివొచ్చిన చాలాసేపటిదాకా నోటమాట రాలేదు. రజని తన నిజస్వరూపంలో వచించినది నిజం అని గంటగట్టుకు చెప్పింది నా హృదయం. ఆలోచనలు అసలు పని చెయ్యవేమో అన్నంత అదటు పుట్టింది. ఆమె నా అంగీకారానికి గాని, ప్రత్యుత్తరానికి గాని ఆగకుండా నే రుసరుసలాడుతూ వెళ్లిపోయింది. పరా

జితుడనైతినే అన్న దిగులుతో ప్రక్కమీద వొరిగిపోయాను. ఎక్కడనుంచి వచ్చిందో మాయనిద్ర చావగొట్టి పారేసినట్లు నన్నెక్కడకో తీసుకుపోయింది.

14

సుప్రభాతం. బాలారుణ కిరణాలు ప్రక్కమీదకు వాలుతూ లేపుతున్నాయి నన్ను. త్వరగా సామానులు సర్దుకొని ప్రొప్రయిటరు గార్కి చెల్లించవలసిన ముడుపుగట్టి రిక్షామీద స్టేషనుకు వచ్చాను. ఆరు గంటల లోపున నే రావలసిన మెయిలు రెండు గంటల లేటు అన్నారు. గత రెండు రోజుల అనుభవాన్నీ తలంచుకుంటూ ప్లాటుఫారంమీద తచ్చాడుతున్నాను. ఆకాశం నిర్మేఘంగా నిర్మల సరోవరంలాగుంది. తుఫానుఅనంతరం ప్రశాంతంగావుండే సాగరంవలె నా హృదయం స్థాయిగావుంది. జరిగిపోయిన సంఘటనలు గుర్తుకొచ్చినకొద్దీ నాలో నాకే నవ్వు అధికమౌతోంది. ఇంద్ర ధనుస్సులోవలె ఈ లోకంలో ఎన్ని రంగు లున్నాయో అనిపిస్తోంది. ఇట్లా ఆలోచించే నన్ను రజని పలుకరించడం చకితపరచింది. ఆమె ముఖం తీరు లోపలవున్న ప్రశాంతతను ప్రస్ఫుటం చేస్తోంది.

"నేను చాలా అదృష్టవంతురాల్ని. ఇవాళ మీరు దొరకరేమో అనుకున్నా. నా భాగ్యం పండి మెయిలు ఆలశ్యమయింది" రజని మళ్ళీ ఎందుకు వచ్చినట్లు?

"రజనీ! నీవు నాలోని చీకటి తెరల్ని చీల్చావు! నిజంగా నీవు రజనివే అని భ్రమపడ్డ నా భ్రమ నిర్భ్రమచేశావు. నిన్న రాత్రి నీ వన్న మాటలు చెవుల్లో ఇంకా మారుమోగుతున్నాయి."

"అది మరచిపోండి. ఆవేశంలో మీరు ఏదో అన్నారుగదా అని నేనూ అన్నాను. అన్యథా భావించకండి."

"ఫర్వాలేదు. ఒక్కొక్కప్పుడు మనం చేస్తున్నాం గనుక అవన్నీ ఎందుకు మంచివి కావూ? అని గర్విస్తాం. ఇలాంటి అవరోధాలు కూడా వాటికి అత్యవసరం."

ఇంతలో మెయిలు వచ్చింది. బండి ఇంకా ఆగకుండానే జనం హడావుడిగా పెట్టే బేడా పట్టుకుని కిటికీలలోంచి లోపలకు పడవేసుకుని కూర్చొనేందుకు స్థలాలు భద్రపరచుకుంటున్నారు. దిగేవాళ్లు ఎక్కేవాళ్లను తోసుకుని దిగుతున్నారు. నేను అప్రయత్నంగా ఒక కిటికీలోకి లంఘించాను అప్పుడే ఒకడు ఖాళీచేసిన సీటు ఆక్రమించుకోవడానికి. బండి నెమ్మదిగా ఆగిపోయింది. రజని అవకాశం పురస్కరించుకుని నా బెడ్డింగు కటికీలోంచి త్రోసింది లోపలకు. నేను చిన్నబోయిన మొగంతో అందుకున్నాను. పెట్టెగూడా ఆమెయే అందిస్తోంది.

"ఇంక వెళ్ళు రజనీ" చెమ్మగిల్లడానికి ఆతురపడే కళ్ళలో వెలుగులాగున చిరునవ్వు చిలకడానికి ప్రయత్నిస్తూ అన్నాను. రజని ఏంచేస్తోందీ! ఏమో చెప్పచూస్తోంది. అబ్బా! ఎంతటి భారం ఆమె గొంతు ముడినొక్కిపట్టి ఆ పలుకులను వెలికి రానీయడంలేదు! పోనీ—మేం వస్తాం అంటూ రెండు వేడి కన్నీటిబిందువులు ఆమె చెక్కిళ్ల మీదుగా జారాయి. "రజనీ! దుఃఖిస్తున్నావా?"

"లేదు. మీరు నన్ను మన్నిస్తారని తుది కోరికగా క్షమాభిక్ష కోరడానికివచ్చాను." ఈ పదజాలంతో దీనంగా ఆమె నావైపు చూచింది. నన్నింకా నొప్పిస్తోంది రజని. నేను ఆమె నేమికోరాలి? క్షమించమనవద్దూ" అనుకొని "అదేంటి రజనీ! నేను నిన్నేం కోరాలి మరి? కన్నీరెట్టుకోకు"

"పోనీ ఒక్కమాట — ఆఖరిసారిగా మిమ్మర్థిస్తున్నాను — ఇవ్వరూ"

"ఇస్తాను" పశ్చాత్తప్త హృదయం ఆమెలో వెలుగుతూ నాలో ధైర్యం నిలిపింది.

"మీది ప్రశాంతసాగర తీరంలో బయలుదేరుతున్న నావ. నాదో—తరంగాల తాకిడిలో, పెనుతుపానుల దెబ్బలలో, సుడిగుండాలమధ్యపడి కొట్టుమిట్టాడి మునుగుతూ తేలుతూ ఒడ్డెరుగని పడవ. విజయ యాత్రచేసే నావికులు, ములిగినపడవల్ని గూర్చి, చుక్కాని పోగొట్టుకున్న కళాసులను గూర్చి ఆలోచించకూడదు. ఎంతటి ధీశాలియైన కర్ణధారికైనా ఆ తలంపులు భీరుత్వం కలిగిస్తాయి. కాబట్టి నా అభ్యర్థన మన్నించి నన్ను మరచిపోండి." మరచిపోతానని చేతిలో చెయ్యి వెయ్యండి" అంటూ ఆమె తన కోమలహస్తం ముందుకుచాచింది. దుఃఖం పెల్లుబికే పెదవుల్ని పంటితో కొరుక్కుని గ్రుడ్లనీళ్లు కుక్కుకుని ఆమె చేతిలో చేతినుంచి "నేను నిన్ను ఉన్న

తికి తీసుకెడదామని ఆశించాను. కాని అది సాధ్యం కాలేదు. అయితే అది ఆశించకుండానే నీవు సాధించి నన్ను వెలుగుబాటలోకి నడిపిస్తున్నావు." అంటూంటే ఆమె కన్నీళ్లూ నా అశ్రువులు ధారగట్టి మా చేతుల్ని తడుపుతున్నాయి. "మాట ఇవ్వరూ" ఆమె మళ్ళీ అడిగింది. "ఇస్తాను. నేనూ నిన్ను ఒకటి అడుగుతా. ఇస్తావా?" ఏమైనా అడగండి. సందేహించకండి. నిన్న మిమ్మువిడిచి ఇంటికెళ్ళడంతోనే నా నటన పటాపంచలైపోయింది. ఇపుడు మీరు చూస్తున్నది వెలుగుపొందిన రజని."

"రజనీ! నీవు బ్రతికుండగా ఇంక ఆ మురికి బాటన నడువనని ప్రమాణం చెయ్యి."

ఆమె మళ్ళీ కళ్లనీళ్లు నింపింది "చేస్తాను. ఇదిగో మన కలయిక సాక్షిగా ప్రమాణం చేస్తున్నాను. నేను ఈ క్షణం లగాయతు ఆ పాడుపని చెయ్యను. ఆ జన్మాంతమూ దీన్ని పాలిస్తాను" సత్యమైన ఆమె ప్రమాణం నా హృదయాన్ని స్పందింపజేసింది.

గార్డు ఈల ఊదాడు. రైలుకు గంటకొట్టారు. ముందునుంచి వెనుకనుంచి పచ్చజెండాలు రెపరెపలాడుతున్నాయి. కడుపునిండా మెక్కి త్రేన్చినట్లు, బొగ్గుమేసిన ఇంజను కూతపెట్టి, రజనిని వదిలిపెట్టడానికి భారంతో వ్యధచెందే నా హృదయం వలె ఒక్కలాగు లాగింది.

"సెలవు. దయమాత్రం వుంచండి. నాకిచ్చిన మాట మరచిపోకండి. నేను మీతో అన్నమాట అక్షరాలా ఆచరిస్తాను. నమస్తే" రజని అక్కడే నిలుచుంది కదలకుండా. అచంచలంగా, గంభీరంగా నిలుచున్న ఆపడుచు కన్నీటితోనే నాకు వీడ్కోలిస్తోంది. 'ధడక్, ధడక్' మంటూ రైలు కమ్మీల గంట్లు తప్పుకుంటోంది మెయిలు. ఒంటిరెక్క, జంటరెక్క, మూడురెక్కలు, నాలుగు రెక్కలు— ఎఱ్ఱరెక్కలలో వాలిన వాటిక్రిందనుంచి బరువుగా దాటుతున్న రైలును ఇంజను అతివేగంగా లాక్కుపోతోంది. నేను దూరమౌతున్నాను రజనికి. నేను కదిలిపోతున్నాను వేగంగా. నా గమనంకంటె వేగంగా గుండె కొట్టుకుంటోంది. నన్ను కాలవాహిని వలె రైలు ఎక్కడికో మోసుకుపోతోంది. కాని రజని అలాగే నిలిచివుంది. అచంచలంగా, ధీమాతో, స్థిరంగా, స్నిగ్ధ హృదయంతో, హాయిగా, సంతోషంతో. నవ్వుతూ చేతిరుమాలు ఊపుతోంది. అదిగో!

నిజంగా రజని జయించింది. కాదు నేనే జయించాను. అబ్బే—కాదు—ఆమెదే విజయం ఎందుకంటున్నారా? ఆమె నాతో అన్నట్లు ఆ వృత్తి మానెయ్యడం ఖాయం. ఆ విషయంలో మటుకు ఆమెదే పైచెయ్యి. ఆ పథంనుండి ఆమె వైదొలగిందంటే నే గెలిచినట్లేగా. మళ్ళీ రజనికోసం చూశాను. మెయిలు ఆ కొద్దిసేపటిలోను—ఎంత దూరం చేసింది రజనిని! రజనికై కళ్లు పెద్దవిచేసుకుని దూరంలోకి చూశాను. రైల్వే లైనులోని కడపటి ఒంటి ఎర్ర రెక్క ఆవలివైపున పుయ్యబడ్డ తెల్లరంగును ఛేదించే నల్లగీత నన్ను చూచి కిలకిల నవ్వుతున్నట్టు లేచి తల ఆడించింది.

సంపూర్ణము